# ప్రజా మెరుపులు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 321 పేజిలు : 04 వెల రూ. 2 మంగళవారం 30 - 06 - 2026




బాబోయ్ పాములు.. హైదరాబాద్ లో పెరిగిన విషసర్పాల బెడద!

## నేటి నుంచి రైతుభరోసా నిధుల విడుదల

- తొలివిడతలో 41.37 లక్షల మంది అన్నదాతలకు లబ్ధి
- నేటి నుంచి రైతుభరోసా నిధుల విడుదల చేస్తామన్న మంత్రి తుమ్మల
- నేడు 2 ఎకరాల వరకు రైతుభరోసా నిధుల జమ
- మిగతావారికి దశలవారీగా విడుదల చేస్తామన్న మంత్రి
- దశలవారీగా నిధులు జమ



**హైదరాబాద్ :** రైతుభరోసా నిధుల విడుదలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన చేశారు. నేటి నుంచి రైతుభరోసా నిధుల విడుదల చేస్తామని తెలిపారు. అర్హులైన అన్నదాతల ఖాతాల్లో దశలవారీగా నిధులు జమచేస్తామని చెప్పారు.రైతుభరోసా నిధుల విడుదల కోసం ఖమ్మం జిల్లా మధిరలో రైతు ఆశీర్వద సభను నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. తొలి విడత నిధులు జమచేయాలని ప్లాన్ చేసింది. అయితే ఖమ్మంలో కురిసిన భారీ వర్షానికి ఏర్పాటుచేయాలని భావించిన రైతు మేళా,కార్యక్రమం కోసం ఏర్పాటుచేసిన సభా ప్రాంగణం వద్ద ఇబ్బందులు తలెత్తాయి. దీంతో రైతు మేళా, రైతు ఆశీర్వాద సభను రద్దు చేసింది.రైతు భరోసా నిధుల విడుదల కోసం రైతు ఆశీర్వాద సభకు బదులుగా హైదరాబాద్ శిల్పకళా వేదికలో 'రైతు భరోసా పంపిణీ సదస్సు'గా నిర్వహించాలని సీఎం ఆదేశించారు.అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద తొలి విడతలో 2 ఎకరాల వరకు నిధులు విడుదల చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నేడు 41.37 లక్షల మంది రైతుల కోసం, రూ.2,482 కోట్లు విడుదల చేస్తామన్నారు. మిగతావారికి - మిగతా 2 లో

## భారీ వర్షాల ఎఫెక్ట్.. సీఎం రేవంత్ సభ రద్దు



2 లో

- భారీ వర్షాల కారణంగా మధిర సభ రద్దు
- సీఎం రేవంత్ సభను హైదరాబాద్‌కు మార్చిన ప్రభుత్వం
- శిల్పకళా వేదికలో 'రైతు భరోసా పంపిణీ సదస్సు'
- మంగళవారం సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం
- రైతు వేదికల నుంచి వర్చువల్‌గా రైతుల భాగస్వామ్యం



2 లో

## కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయి

- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- వాటితోనే రేవంత్ గెలిచారా?
- దేశ వ్యాప్తంగా ఎనిమిది సార్లు 'సర్' ప్రక్రియ జరిగిందన్న కవిత
- బోధన్ లో ఇప్పటి వరకు 7 వేల ఓట్లు తీసేశారని వెల్లడి
- హైదరాబాద్‌లో ఉండే చాలా మందికి ఏపీలో కూడా ఓట్లు ఉన్నాయన్న కవిత

## వీబీ జీ రామ్ జీ పథకంపై కేంద్రానికి అభ్యంతరాలను తెలియజేసిన సీతక్క

- జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న సీతక్క
- కొత్త పథకం ప్రవేశపెడితే మొత్తం ఆర్థిక భారం రాష్ట్రంపైనే పడుతుందని వ్యాఖ్య
- పీఎం ఆవాస్ యోజన కింద తక్షణమే గృహాలను మంజూరు చేయాలని విన్నపం



**హైదరాబాద్ :** వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర - మిగతా 2 లో

## ఢిల్లీని కాలుష్య రహిత రాజధానిగా మార్చడమే ప్రధాన లక్ష్యం

- 'ఢిల్లీ ఈవీ పాలసీ 2026'కు ఢిల్లీ కేబినెట్ ఆమోదం
- వినియోగదారులకు రూ.15,000 కోట్ల మేర ప్రయోజనాలు కల్పన
- ఎలక్ట్రిక్ వాహనాలకు 100 శాతం రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు రద్దు
- జూలై 1 నుంచి కొత్త పాలసీ అమల్లోకి వచ్చే అవకాశం



**ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యాన్ని తగ్గించి, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా బీజేపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. "ఢిల్లీ ఈవీ పాలసీ 2026"కు తమ కేబినెట్ ఆమోదం తెలిపిందని ముఖ్యమంత్రి రేఖా గుప్తా సోమవారం ప్రకటించారు. ఈ కొత్త విధానం - మిగతా 2 లో



## రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మరోసారి మల్లికార్జున ఖర్గే

- ఖర్గేను ప్రతిపక్ష నేతగా గుర్తించిన రాజ్యసభ ఛైర్మన్
- ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజ్యసభకు ఎన్నికైన ఖర్గే
- రాజ్యసభ సభ్యునిగా ప్రమాణం చేసిన మల్లికార్జున ఖర్గే
- ఈనెల 26నుంచి అమల్లోకి రానున్న ఖర్గే నియామకం

**ఢిల్లీ :** రాజ్యసభకు తిరిగి ఎన్నికైన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రతిపక్ష నేతగా మళ్లీ గుర్తింపు పొందారు. ఆయన పదవీకాలం ఈనెల 25తో ముగియనుండగా ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో తిరిగి ఎన్నికయ్యారు. దీంతో రాజ్యసభ ఛైర్మన్ రాధాకృష్ణన్ ఖర్గేను ప్రతిపక్ష నేతగా గుర్తించారు. ఈనెల 26నుంచి - మిగతా 2 లో

## ఒకవైపు శాంతి మంత్రం మరోవైపు రక్తపాతం!

- ఆఫ్ఘనిస్థాన్‌లోని మూడు జిల్లాలపై పాకిస్థాన్ వైమానిక దాడులు
- వివాదాస్పద 'డబుల్ ట్యాప్' వ్యూహంతో దాడిలో 35 మంది మృతి
- ఉగ్రవాద స్థావరాలపైనే దాడులని పాక్ వాదన
- పౌరులు మరణించారని ఆఫ్ఘన్ ఆరోపణ



**ఢిల్లీ :** అంతర్జాతీయ వేదికపై అమెరికా, ఇరాన్ మధ్య శాంతిని నెలకొల్పేందుకు మధ్యవర్తిత్వం వహిస్తూ ప్రశంసలు అందుకుంటున్న పాకిస్థాన్, సొంత సరిహద్దుల్లో మాత్రం భీకర దాడులకు పాల్పడుతోంది. ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లో పాక్ సైన్యం తాజాగా జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 35 మంది మరణించారు. - మిగతా 2 లో



2 లో

## హర్మూజ్ సంక్షోభంలో భారత్ విజయం

- టోల్ చెల్లించకుండా 12 నౌకలు ఇండియాకు
- హర్మూజ్ మూసివేతతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం
- పలు దేశాల నుంచి ముడి చమురు తెప్పించామని వెల్లడి
- దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తిని కూడా పెంచామన్న మంత్రి

## ఖమేనీ అంత్యక్రియలకు మోదీ దూరం

- ఖమేనీ అంత్యక్రియలకు భారత్ ప్రతినిధులు
- జులై 4న ఖమేనీ అంతక్రియలు ప్రారంభం
- ఆ సమయంలో ఇండోనేషియా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా పర్యటనకు మోదీ
- భారత్ తరపున బిహార్ గవర్నర్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి



**ఢిల్లీ :** ఇరాన్ దివంగత మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకావడం లేదు. ఆయన స్థానంలో బీహార్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అతా హస్నైన్, కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి పవిత్ర మార్గెరిటా భారత ప్రతినిధులుగా పాల్గొననున్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ ఇటీవల - మిగతా 2 లో

## ప్రభుత్వ స్కూళ్లలో సీట్ల కోసం రికమెండేషన్ అడిగే రోజులు వచ్చాయి




- రాష్ట్ర విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్
- షైనింగ్ స్టార్లే ప్రభుత్వ పాఠశాలలకు బ్రాండ్ అంబాసిడర్లు అన్న మంత్రి లోకేశ్
- వచ్చే ఏడాది ప్రైవేటు నుంచి 2 లక్షల మందిని ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించడమే లక్ష్యం
- విద్యార్థుల కోణం నుంచే విద్యాశాఖలో సంస్కరణలు చేపట్టామని వెల్లడి
- టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు 'షైనింగ్ స్టార్స్' పేరిట సత్కారం

**అమరావతి :** వచ్చే ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి కనీసం రెండు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరాలన్నదే తన లక్ష్యమని, ఈ మార్పునకు 'షైనింగ్ స్టార్లే' బ్రాండ్ అంబాసిడర్లని రాష్ట్ర విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. భవిష్యత్తులో దేశం మొత్తం ఏపీ విద్యా నమూనా గురించే మాట్లాడుకోవాలని ఆకాంక్షించారు. గత సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను 'షైని ంగ్ స్టార్స్' పేరుతో ఘనంగా సత్కరించారు. తాడేపల్లిలోని సీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో టెన్త్ టాపర్లు - మిగతా 2 లో


## అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు గర్వపడాలి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో భాగమైనందుకు గర్వించండి
- అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు గర్వపడాలన్న సీఎం
- నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థలకు ఆదేశం
- రూ.50,999 కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడి
- ప్రతి రెండు నెలలకు ఒకసారి పనుల పురోగతిపై సమీక్ష జరుపుతామన్న చంద్రబాబు
- అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణాలు ఐకానిక్‌గా ఉండాలని సూచన



**అమరావతి :** దేశం గర్వించే రాజధాని అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలని, ఇది కేవలం కట్టడాల నిర్మాణం కాదని, ఓ చరిత్ర నిర్మాణమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో పాలుపంచుకుంటున్న కాంట్రాక్టు సంస్థలు, తాము ఒక బ్రాండ్‌ను సంపాదిస్తున్నామన్న భావనతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై సచివాలయంలో ఎల్ అండ్ టీ, షాపూర్ జీ పల్లోంజి, మెగా ఇంజినీరింగ్, ఎన్సీసీ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సోమవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "హైదరాబాద్ ప్లస్‌గా అమరావతిని నిర్మిస్తున్నాం. ఇది యావత్ దేశానికి గర్వకారణంగా నిలవాలి. అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా రూపుదిద్దుకుంటున్న అమరావతిలో మేం భాగస్వాములం అయ్యామన్న ఆలోచనతో కాంట్రాక్టర్లు - మిగతా 2 లో

## ప్రజానాడి



# సంపాదకీయం

## 'గుర్తింపు' బాధలు!



భారత ప్రభుత్వం జారీచేసిన పాస్‌పోర్టు ఉన్నంతమాత్రాన భారతీయ పౌరులు కాబోరని కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటన పెద్ద దుమారం రేపింది. మాధ్యమాల్లో తీవ్రచర్చోపచర్చలకు తోడుగా సోషల్ మీడియాలో జోకుల వర్షం కురుస్తోంది. ఇంతోటిదానికీ, పాస్‌పోర్టు జారీకి సంక్లిష్టమైన ప్రక్రియలూ పోలీసు వెరిఫికేషన్లతో ప్రజలను వేధించడం ఎందుకని కొందరు ఎగతాళి చేస్తున్నారు. పైగా, పాస్‌పోర్టు సేవాదివస్ సందర్భంగా కేంద్ర విదేశాంగశాఖ ఈ వ్యాఖ్యలు చేస్తూ, అది కేవలం విదేశీప్రయాణాలకు వీలుకల్పించే అనుమతిపత్రమే తప్ప, అది ఉన్నంతమాత్రాన ఈ దేశ పౌరసత్వం వచ్చేసినట్టు కాదని వ్యాఖ్యానించి మరీ వివాదం రేపింది. భారతీయ పౌరసత్వానికి ఇప్పుడు ఏకైక రుజువు హిందువు కావడమా అని ఒకరు ప్రశ్నిస్తే, బీజేపీ ఓటరైతే పౌరుడేనని మరొకరన్నారు. ఇంతకాలమూ నా దగ్గర ఆధార్ ఉన్నా, ఓటరు కార్డున్నా నేను పౌరుడిని కాదు పొమ్మన్నారు, ఇప్పుడు పాస్‌పోర్టును కూడా ఆ జాబితాలో చేర్చారు, పుట్టుకనుంచి చావు వరకూ ప్రభుత్వం మంజూరు చేస్తున్న అన్నేసి పత్రాల్లో ఏ ఒక్కటైనా నన్ను ఈ దేశపౌరుడుగా గుర్తిస్తుందా? అని ఒక జర్నలిస్టు సోషల్ మీడియాలో వాపోయారు. ఈ దేశపౌరులు గుర్తింపు సంక్షోభంలో ఉన్నారన్న వ్యాఖ్య ఈ పరిస్థితికి చక్కగా అతుకుతుంది. ఓటరు కార్డు మంజూరు చేసిన ఎన్నికల సంఘం అది గుర్తింపు కార్డు మాత్రమేనని తీసిపారేసింది. ప్రభుత్వం అన్నింటికీ ఆధార్‌నే ఆధారం చేసినప్పటికీ, అది కూడా పౌరసత్వానికి రుజువు కాదన్నది. జననం, శాశ్వత నివాసం అనే రెండు మూలాధార పత్రాలతో సహా సవాలక్ష రుజువులు చూపితే కానీ మంజూరు కాని పాస్‌పోర్టు సైతం ఇప్పుడు ఆ జాబితాలో చేరడం పౌరసమాజానికి ఆగ్రహం కలిగిస్తోంది. పాస్‌పోర్టు కేవలం విదేశీ ప్రయాణపత్రం అయితే, అక్కడి పౌరసత్వం తీసుకున్నవారు ఇక్కడ దానిని తిరిగి వెనక్కు ఇచ్చేయాలన్న నిబంధన ఎందుకు ఉన్నట్టు? ఒకరి పాస్‌పోర్టు రద్దయినా, నిషేధించినా, దానిని ఉపసంహరించుకున్నా అది ప్రభుత్వానిది అయిపోయినట్లేనని నిబంధనల్లో అంత ప్రత్యేకించి ఎందుకు రాసినట్టు? ఇత్యాది ప్రశ్నలు అనేకం వింటున్నాం. స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలవుతున్నా, ఎవరు భారత పౌరుడు అన్న ఆ మౌలిక ప్రశ్న ఇంకా మిగిలేవుందని దీని అర్థం. పౌరసత్వాన్ని నిర్ధారించే సార్వత్రిక, సర్వామోదిత పత్రం ఒక్కటీ ఇప్పటికీ లేకపోవడం ప్రభుత్వ వైఫల్యమే. ఒకపక్క ఉగ్రవాదం, తీవ్రవాదం, పొరుగు దేశాల నుంచి అక్రమవలసలు, చొరబాట్ల గురించి తీవ్రమైన వాగ్యుద్ధాలు చేస్తూ, ఎన్నికల్లో అత్యధికంగా లబ్ధిపొందుతూ, మరోపక్క పౌరులు కాదన్న పేరిట లక్షలాదిమందిని ఓటరు జాబితానుంచి తొలగిస్తూ ఎవరు పౌరులన్న ఈ ప్రశ్నను మాత్రం సమాధానం లేకుండా వదిలేయడం విచిత్రం. అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌ల నుంచి 2014 డిసెంబరు 31కి ముందు ఈ దేశంలోకి వచ్చిపడినవారికి కూడా పౌరసత్వాన్ని కట్టబెడుతూ, ఇక్కడ పాస్‌పోర్టులు ఉన్నంతమాత్రాన పౌరులు కానక్కరలేదని అనడం ఆశ్చర్యమే. పౌరసత్వానికి అంతిమంగా ఇదీ రుజువంటూ ఏదీ లేకుండా చేసి, దానిని నిరూపించుకోవాల్సిన బరువు మాత్రం జనం మీదకు నెట్టేయడం విషాదం. రేషన్‌కార్డు, ఓటరుకార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్.. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రభుత్వాలు మంజూరు చేసేవి సంఖ్యానేకం. ఇవన్నీ ఒకదాని ఆధారంగా మరొకటి మంజూరు అవుతూ పరస్పరం ముడిపడివున్నవే. అయినప్పటికీ, ఈ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఆ జాబితాలో ఏ ఒక్కటీ మనలను పౌరుడిగా గుర్తించదు, మరేది నిశ్చయంగా నిర్ధారిస్తుందో తెలియదు. ఆధార్ ప్రాజెక్టు ఆరంభిస్తున్నప్పుడూ, దానిని బలవంతంగా ప్రభుత్వ సేవలతో అనుసంధానిస్తున్నప్పుడూ పాలకులు చాలా మాటలు చెప్పారు. ఇటీవలివరకూ పాస్‌పోర్టుకు కూడా మూలధారం ఆధార్ నెంబరే కానీ, ఇప్పుడు అదీ పనికిరాకుండా పోయింది. సహజంగా అధికారులు ఆయా సందర్భాలను బట్టి ఏవో పత్రాల మీద ఆధారపడతారు. కానీ, రాజకీయ అవసరాలు, రేపటి ఎత్తులూ జిత్తులు ముందుకువచ్చి ప్రధానమైపోయినప్పుడు ప్రజలకు ఇటువంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయి. తమ గుర్తింపును నిరూపించుకోవడం వారికి అతిపెద్ద సవాలుగా పరిణమిస్తుంది. పౌరసత్వ రాజకీయాలు కొనసాగుతున్నంతకాలం ఈ అగ్నిపరీక్షలు తప్పవేమో.

## గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాం

**మొదటిపేజీ తరువాయి -** అనిత వెల్లడించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నెట్‌వర్క్‌ను కూకటి వేళ్లతో పెకలించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక వింగ్ 'ఈగల్' టాస్క్‌ఫోర్స్ క్షేత్రస్థాయిలో అద్భుతమైన ఫలితాలను సాధిస్తోందని హోంమంత్రి కొనియాడారు. ఈ స్పెషల్ ఆపరేషన్ల ద్వారా ఇప్పటివరకు దాదాపు 1.20 లక్షల కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, శాస్త్రీయ పద్ధతుల్లో పూర్తిగా దహనం చేసినట్లు తెలిపారు. కేవలం మత్తు పదార్థాలను సీజ్ చేయడమే కాకుండా... అంతరాష్ట్ర స్మగ్లర్లకు చెందిన సుమారు రూ. 24 కోట్ల విలువైన ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసిందని వెల్లడించారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తు మాఫియాపై ఉక్కుపాదం మోపేలా రాబోయే రోజుల్లో ఏజెన్సీ ఏరియాల్లో తనిఖీలను మరింత తీవ్రతరం చేస్తామని, డ్రగ్స్ సమాచారాన్ని గోప్యంగా అందించడానికి 'ఈగల్' కొత్త వెబ్‌సైట్, టోల్‌ఫ్రీ నంబర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చామని అనిత తెలిపారు.

## నేటి నుంచి రైతుభరోసా నిధుల విడుదల

**మొదటిపేజీ తరువాయి -** దశలవారీగా నిధులు జమచేస్తామని చెప్పారు. మొత్తంగా 10 రోజుల్లో అర్హులందరికీ పెట్టుబడి సాయం అందజేయనున్నారు. కొత్తగా పాసుబుక్‌లు వచ్చిన వారు జులై 5లోపు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి తుమ్మల చెప్పారు.

## కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయి



**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ హాట్ టాపిక్ గా మారింది. దీనిపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఎనిమిది సార్లు 'సర్' ప్రక్రియ జరిగిందని తెలిపారు. బోధన్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 7 వేల ఓట్లు తీసేశారని... దీనిపై ఎన్నికల సంఘం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో కేవలం 800 ఓట్లను మాత్రమే తొలగించారని కవిత విమర్శించారు. కానీ తాము క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే.. అక్కడ ఏకంగా 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు తేలిందని అన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి 32 వేల మెజారిటీతోనే గెలిచారని.. ఈ డూప్లికేట్ ఓట్లతోనే ఆయన గెలిచారా? అనే అనుమానం తమకు ఉందన్నారు. సినీనటుడు ప్రకాశ్ రాజ్‌కు రెండు వేర్వేరు చోట్ల ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించడానికి ఏడేళ్ల సుదీర్ఘ సమయం పట్టిందని ఈసీని విమర్శించారు. హైదరాబాద్‌లో ఉండే చాలా మంది ఓటర్లకు అటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఓట్లు ఉన్నాయని, ఈ డూప్లికేట్ ఓట్లను తొలగించడంలో అధికారులు ఫెయిల్ అయ్యారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 'సర్' ప్రక్రియ జరుగుతున్నందున.. రాష్ట్రాల మధ్య ఉన్న ఓటర్ డేటాను లోతుగా పరిశీలన చేయాలని కవిత సూచించారు. ఒక పౌరుడికి దేశంలో ఎక్కడైనా ఒకే ఒక్క చోట మాత్రమే ఓటు ఉండేలా చూడాలని అన్నారు. డూప్లికేట్ ఓట్ల స్కామ్‌పై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

# ప్రభుత్వ స్కూళ్లలో సీట్ల కోసం రికమెండేషన్ అడిగే రోజులు వచ్చాయి

**మొదటిపేజీ తరువాయి -** 55 మందికి రూ. 30 వేల నగదు బహుమతి, ఇంటర్ టాపర్లు 61 మందికి ల్యాప్‌టాప్‌లు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "నిద్రలో కనిపించేది కల కాదు, మిమ్మల్ని నిద్రపోనివ్వనిదే నిజమైన కల. నిద్రపోకుండా మీరు పడిన కష్టమే మిమ్మల్ని షైనింగ్ స్టార్స్‌గా నిలబెట్టింది. మీరు గెలిచారు, నన్ను గెలిపించారు, మన విద్యావ్యవస్థను గెలిపించారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. మీ పనితీరు వల్ల మంత్రిగా నాకు, 2 లక్షల మంది ఉపాధ్యాయులకు గౌరవం పెరిగింది" అని విద్యార్థులను ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీట్ల కోసం ఎమ్మెల్యేల సిఫార్సులు అడిగే రోజులు వచ్చాయని, మంగళగిరిలో ఒక తల్లి తనను నిడమర్రు స్కూలులో సీటు ఇప్పించాలని కోరిన విషయాన్ని గుర్తుచేశారు.

### విద్యారంగంలో సమూల మార్పులు

విద్యాశాఖను వ్యవసాయంతో పోల్చిన లోకేశ్, ఫలితాలు వెంటనే రావని, నిరంతరం శ్రమిస్తేనే పంట చేతికొచ్చిన ఆనందం దక్కుతుందని అన్నారు. విద్యార్థులను కేంద్రంగా చేసుకుని అనేక సంస్కరణలు చేపట్టామని వివరించారు. "గతంలో పాఠ్యపుస్తకాలపై ముఖ్యమంత్రి, మంత్రుల బొమ్మలుండేవి. నాకు ఆ ఫోటో పిచ్చి లేదు. అందుకే బ్యాగ్‌పై, బెల్ట్‌పై, గుడ్డుపై, స్కూలులో ఎక్కడా బొమ్మలు లేకుండా చేశాం. పాఠశాలల్లో రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశాం" అని తెలిపారు. 'వన్ క్లాస్-వన్ టీచర్', డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్టూడెంట్ కిట్, డొక్కా సీతమ్మ పేరుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సెంట్రలైజ్డ్ కిచెన్లు ఏర్పాటు చేసి భోజన నాణ్యతను మరింత పెంచుతామని హామీ ఇచ్చారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామని, 'నో బ్యాగ్ డే' అమలు చేస్తున్నామని తెలిపారు.

### విలువలకే పెద్దపీట

విలువలు లేని సమాజం ప్రమాదకరమని, అందుకే నైతిక విలువల కోసం చాగంటి కోటేశ్వరరావు గారిని సలహాదారుగా నియమించామని లోకేశ్ పేర్కొన్నారు. "అమ్మకు చెప్పలేని పని చేయొద్దు అనే ఆయన మాట చాలా శక్తివంతమైనది. మహిళలను గౌరవించడం ఇంటి నుంచే మొదలుకావాలి. తల్లికి వందనం వంటి కార్యక్రమాల ద్వారా ఆ మార్పునకు శ్రీకారం చుట్టాం" అని చెప్పారు. విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు కావాలని కలలు కనడంతో పాటు, రాజకీయాల్లోకి వచ్చి సమాజాన్ని మార్చే నాయకులుగా కూడా ఎదగాలని ఆకాంక్షించారు.

### ఓటమి నుంచే పాఠాలు నేర్చుకోవాలి

తన రాజకీయ జీవితాన్ని ఉదాహరణగా చూపుతూ విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. "2019లో ఇదే మంగళగిరి నియోజకవర్గంలో ఓడిపోయినప్పుడు బాధ కలిగినా, పట్టుదలతో ఐదేళ్లు పనిచేసి 91 వేల మెజారిటీతో గెలిచాను. జీవితంలో సవాళ్లు ఎదురైనప్పుడు వెనుకడుగు వేయొద్దు. ఫెయిల్ అంటే ఫస్ట్ ఎటెంప్ట్ ఇన్ లెర్నింగ్ అని గుర్తుంచుకోండి" అని సూచించారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థిపై లక్ష రూపాయలు ఖర్చు చేస్తోందని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. చదువు పూర్తయ్యాక, అవకాశం వచ్చినప్పుడు సొంత పాఠశాలకు సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మరోసారి మల్లికార్జున ఖర్గే

**మొదటిపేజీ తరువాయి -**
ప్రతిపక్ష నేతగా ఆయన నియామకం అమల్లోకి వస్తుందని రాజ్యసభ సెక్రటరీ జనరల్ రాజ మోదీ బులెటిన్ విడుదల చేశారు. అంతకుముందు రాజ్యసభ ఛైర్మన్ ఛాంబర్‌లో సోమవారం మల్లికార్జున ఖర్గే ప్రమాణం చేశారు. ఖర్గే చేత రాజ్యసభ ఛైర్మన్ ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఖర్గే తన చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా హాజరయ్యారు. రాజ్యసభ సభ్యుడిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, ప్రతిపక్ష నాయకుడిగా తన సేవలను కొనసాగిస్తానని ఖర్గే అన్నారు. రాజ్యసభకు తన పునఃనియమించడాన్ని, ప్రతిపక్ష నాయకుడిగా తనను కొనసాగించడాన్ని అపారమైన గర్వకారణంగా అభివర్ణించారు. అటు అధికారులు, పార్టీ నాయకత్వం, రాజకీయ సహచరులు అందించిన మద్దతుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. "రాజ్యసభ సభ్యుడిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేసే గౌరవం నాకు లభించింది. రాజ్యసభకు ప్రతిపక్ష నాయకుడిగా సేవలు కొనసాగించడం అపారమైన గర్వకారణం, బాధ్యత. నాకు నిరంతరం మద్దతు అందించిన భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు, డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు. కాంగ్రెస్ నాయకత్వానికి, ముఖ్యంగా సీపీపీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీకి, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి ధన్యవాదాలు. ఇంకా కాంగ్రెస్ పార్టీలోని తోటి సహచరులు, ఎంపీలకు, నా సుదీర్ఘ ప్రజా జీవితం, పార్లమెంటరీ సేవ ప్రయాణంలో అచంచలమైన విశ్వాసం, ప్రోత్సాహంతో నాకు అండగా నిలిచిన లెక్కలేనంత మంది పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లకు, ముఖ్యంగా ఇండియా బ్లాక్‌లోని సహచరులకు, ఇతర ప్రతిపక్షాల సహకారానికి నేను కృతజ్ఞుడను.'. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే, బీజేపీ నేత తరుణ్ చుగ్ సహా ఎనిమిది మంది నూతన రాజ్యసభ ఎంపీలు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఖర్గే ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఛాంబర్‌లో ప్రత్యేకంగా ప్రమాణ స్వీకారం చేయగా, మిగిలిన ఏడుగురు సభ్యులు రాజ్యసభ ఛాంబర్‌లో ప్రమాణం చేశారు. నూతనంగా ప్రమాణం చేసిన వారిలో జితేంద్ర మేఘ్‌జీభాయ్ కంజారియా, మాన్‌సింగ్ మేరామన్ పర్మార్ (గుజరాత్), ఎం. నాగరాజ (కర్ణాటక), రాజేంద్ర హీరాలాల్ జైన్ (మహారాష్ట్ర), అధికారిమయుమ్ శారదా దేవి (మణిపూర్), అల్కా సింగ్ (రాజస్థాన్) ఉన్నారు. ఛైర్మన్ ఛాంబర్, సభలో జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్, సభ నేత జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పాల్గొన్నారు.

# ఒకవైపు శాంతి మంత్రం.. మరోవైపు రక్తపాతం!

**మొదటిపేజీ తరువాయి -** మృతులంతా ఉగ్రవాదులేనని పాకిస్థాన్ వాదిస్తుండగా, అమాయక పౌరులు, చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని ఆఫ్ఘనిస్థాన్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో పాక్ సైన్యం అనుసరించిన వివాదాస్పద 'డబుల్ ట్యాప్' వ్యూహం తీవ్ర విమర్శలకు దారితీసింది.

### ఏమిటీ 'డబుల్ ట్యాప్' దాడి?

సైనిక పరిభాషలో 'డబుల్ ట్యాప్' అంటే ఒకే ప్రదేశంపై కొద్ది వ్యవధిలో రెండోసారి దాడి చేయడం. ఇది అత్యంత క్రూరమైన, అమానవీయమైన వ్యూహంగా పరిగణిస్తారు. ఎందుకంటే, మొదటి దాడి తర్వాత సహాయక చర్యల కోసం వచ్చే సిబ్బంది, వైద్యులు, పౌరులను లక్ష్యంగా చేసుకుని రెండో దాడి జరుపుతారు. భారత కాలమానం ప్రకారం నిన్న అర్ధరాత్రి 12:30 గంటలకు పాక్ వైమానిక దళం (పీఏఎఫ్) జెట్లు ఆఫ్ఘనిస్థాన్‌లోని పక్తికా, పక్తియా, కునార్ జిల్లాల్లోని ఇళ్లు, మసీదులపై బాంబులు వేశాయి. సరిగ్గా 25 నిమిషాల తర్వాత అంటే 12:55 గంటలకు, శిథిలాల కింద చిక్కుకున్న మహిళలు, పిల్లలను కాపాడేందుకు గ్రామస్థులు పరుగెత్తుకురాగా, పాక్ జెట్లు మళ్లీ విరుచుకుపడి వారిపైనే రెండోసారి బాంబుల వర్షం కురిపించాయి. ఈ రెండో దాడి కారణంగానే మృతుల సంఖ్య అనూహ్యంగా పెరిగి, వందకు పైగా క్షతగాత్రులతో ఆసుపత్రులు నిండిపోయాయి.

### పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ వాదనలు

గతవారం కరాచీలో తమ సైనిక దళాలపై జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు పాకిస్థాన్ ప్రకటించింది. తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) నుంచి విడిపోయిన జమాత్-ఉల్-అహ్రార్ ఉగ్రవాదుల స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిపామని, ఇందులో 29 మంది ఉగ్రవాదులు హతమయ్యారని పాక్ సమాచార శాఖ మంత్రి అత్తావుల్లా తారర్ తెలిపారు. అయితే, పాకిస్థాన్ వాదనను ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపందల చర్య అని, పాక్ దురాక్రమణకు పాల్పడిందని తాలిబన్ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ మండిపడ్డారు. ఈ దాడుల్లో 35 మందికి పైగా అమాయక పౌరులు మరణించారని, వీరిలో 4 నుంచి 9 ఏళ్ల వయసున్న చిన్నారులు, వృద్ధులు ఉన్నారని ఆయన తెలిపారు. "దాడి జరిగినప్పుడు ఆ ప్రాంతంలో ఎలాంటి ఉగ్రవాదులు లేరు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న మాపైనే రెండోసారి బాంబు వేశారు. ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకు పాకిస్థాన్ అబద్ధాలు చెబుతోంది" అని దాడిలో గాయపడిన ఒక స్థానికుడు ఆవేదన వ్యక్తం చేశాడు. 2021లో తాలిబన్లు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాక్-ఆఫ్ఘన్ సంబంధాలు ఉద్రిక్తంగానే ఉన్నాయి. సరిహద్దుల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం ఇస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తుండగా, తమ భూభాగంలో ఉగ్రవాదులు ఎవరూ లేరని తాలిబన్లు స్పష్టం చేస్తున్నారు. గత 9 నెలల్లో పాకిస్థాన్ జరిపిన దాడుల్లో సుమారు 570 మంది అమాయక ఆఫ్ఘన్ పౌరులు ప్రాణాలు కోల్పోయారని నివేదికలు చెబుతున్నాయి. ఒకవైపు అంతర్జాతీయ శాంతి దూతగా వ్యవహరిస్తూ, మరోవైపు పొరుగు దేశంపై దాడులకు పాల్పడటం పాకిస్థాన్ ద్వంద్వ వైఖరిని స్పష్టం చేస్తోంది.

## వీబీ జీ రామ్ జీ పథకంపై కేంద్రానికి అభ్యంతరాలను తెలియజేసిన సీతక్క



**మొదటిపేజీ తరువాయి -** అభ్యంతరాలు ఉన్నాయని మంత్రి సీతక్క కేంద్రానికి తెలియజేశారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న ఆమె... తెలంగాణలో అమలు చేస్తున్న గ్రామీణాభివృద్ధి పథకాల వివరాలను కేంద్రానికి వివరించారు. జులై 2న వీబీ జీ రామ్ జీ పథకం కొనసాగించాలా? లేక కొత్త పథకం తీసుకురావాలా? అనే అంశంపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని సీతక్క ప్రకటించారు. కొత్త పథకం ప్రవేశపెడితే 100 శాతం ఆర్థిక భారం రాష్ట్రంపైనే పడుతుందని, ఇది సమస్యాత్మకమని కేంద్రానికి తెలియజేశారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో 100 శాతం వేతనాల విధానం కొనసాగించాలని, మెటీరియల్ కాంపోనెంట్‌కు 75 శాతం కేంద్ర వాటా ఉండాలని విజ్ఞప్తి చేశారు. పీఎం ఆవాస్ యోజన కింద గత బీఆర్ఎస్ ప్రభుత్వం వద్దనడంతో కేటాయింపులు లేవని... ఆ పథకం కింద తక్షణమే గృహాలు మంజూరు చేయాలని సీతక్క కోరారు. పీఎంజీఎస్‌వై రోడ్లకు అటవీ అనుమతులు ప్రధాన అడ్డంకిగా ఉన్నాయని, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. తెలంగాణలో జల్ సంచార్ విభాగంలో 13 జాతీయ అవార్డులు సాధించడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని సీతక్క పేర్కొన్నారు.

## ఢిల్లీని కాలుష్య రహిత రాజధానిగా మార్చడమే ప్రధాన లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి -** జూలై 1 నుంచి అమల్లోకి వచ్చి, 2030 మార్చి 31 వరకు కొనసాగే అవకాశం ఉందని ఆమె తెలిపారు. ఈ పాలసీ ద్వారా రాబోయే నాలుగేళ్లలో పౌరులకు సుమారు రూ. 15,000 కోట్ల ప్రయోజనాలు చేకూరుతాయని సీఎం వివరించారు. ఇందులో భాగంగా, ప్రభుత్వం నేరుగా రూ. 7,000 కోట్లను ఛార్జింగ్ స్టేషన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు చేయనుంది. మరో రూ. 8,000 కోట్లను పన్ను మినహాయింపులు, ప్రోత్సాహకాల రూపంలో ఈవీ వినియోగదారులకు అందిస్తుంది. లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సంధు ఆమోదం తర్వాత ఈ పాలసీ అధికారికంగా అమల్లోకి వస్తుంది. ఈ కొత్త పాలసీలో భాగంగా, 2027 జనవరి 1వ తేదీ నుంచి ఢిల్లీలో కొత్త పెట్రోల్ లేదా సీఎన్‌జీ ఆటో రిక్షాల రిజిస్ట్రేషన్‌ను పూర్తిగా నిషేధిస్తారు. ఆ తర్వాత కేవలం ఎలక్ట్రిక్ ఆటోలకు మాత్రమే అనుమతి ఉంటుంది. అదేవిధంగా, 2028 ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త పెట్రోల్, సీఎన్‌జీ టూవీలర్ల రిజిస్ట్రేషన్లను కూడా నిలిపివేయనున్నారు. కొత్త విధానం ప్రకారం, ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసేవారికి 100 శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు నుంచి పూర్తి మినహాయింపు లభిస్తుంది. కార్ల విషయానికొస్తే, రూ. 30 లక్షల లోపు ఎక్స్-షోరూమ్ ధర ఉన్న వాహనాలకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, కార్లు, తేలికపాటి గూడ్స్ ట్రక్కులు, గ్రామీణ సేవా వాహనాలతో సహా అన్ని రకాల వాహనాలకు ఈ పాలసీ వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. సాధారణ వాహనాలకు, ఎలక్ట్రిక్ వాహనాలకు మధ్య ధర వ్యత్యాసాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ రాయితీలు రూపొందించినట్లు సీఎం రేఖా గుప్తా తెలిపారు. "కాలుష్య రహిత, స్వచ్ఛమైన రవాణా రాజధానిగా ఢిల్లీని మార్చడమే ఈ పాలసీ ప్రధాన ఉద్దేశం" అని ఆమె పేర్కొన్నారు. వాహనాల కొనుగోలును ప్రోత్సహించడమే కాకుండా, పాత వాహనాల తుక్కు (స్క్రాపింగ్), ఛార్జింగ్ మౌలిక సదుపాయాల కల్పనపై కూడా ఈ పాలసీ దృష్టి సారిస్తుందని ఆమె వివరించారు. ఈ పాలసీ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన కేబినెట్ మంత్రులు పంకజ్ కుమార్ సింగ్, ఆశిష్ సూద్, మంజిందర్ సింగ్ సిర్సాలను సీఎం అభినందించారు.

## అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు గర్వపడాలి

**మొదటిపేజీ తరువాయి -** పనిచేయాలి" అని సూచించారు. నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత గడువు కంటే ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని, అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్లు రాష్ట్రానికి ఐకానిక్ నిర్మాణాలుగా నిలిచిపోవాలని ఆకాంక్షించారు.( ప్రస్తుతం రాజధాని పరిధిలో రూ.50,999 కోట్ల విలువైన పనులు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. హౌసింగ్, ట్రంక్ ఇన్‌ఫ్రా, ఎల్పీఎస్ ఇన్‌ఫ్రాతో పాటు కీలకమైన ప్రభుత్వ భవనాల నిర్మాణం వేగంగా జరుగుతోందని తెలిపారు. పనుల వేగవంతానికి అవసరమైన యంత్రాలు, మానవ వనరులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం 26,924 మంది కార్మికులు, 5,140కి పైగా భారీ యంత్రాలు పనుల్లో నిమగ్నమై ఉన్నాయని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ముఖ్యమంత్రికి వివరించారు. భవిష్యత్తులో వరద ముంపు సమస్యలు తలెత్తకుండా కొండవీటి వాగు, పాలవాగులను వెడల్పు చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు ఐదేళ్ల పాటు రాజధాని నిర్మాణాన్ని పూర్తిగా నిలిపివేశారని, రెండేళ్లుగా తాము మళ్లీ పనులను గాడిలో పెట్టామని చంద్రబాబు గుర్తుచేశారు. దేశంలోని పవిత్ర క్షేత్రాల నుంచి మట్టి, నీరు తెచ్చి పునీతం చేసిన ఈ ప్రాంతంలో నిర్మాణాలను అడ్డుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, అయినా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించేందుకు ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం అవుతానని తెలిపారు. నిర్మాణాలు పూర్తయ్యాక, ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఈ సమీక్షలో సీఆర్డీఏ అధికారులు, వివిధ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హర్మూజ్ సంక్షోభంలో భారత్ విజయం

**మొదటిపేజీ తరువాయి -** ప్రపంచాన్ని కుదిపేసిన ఇంధన సంక్షోభ సమయంలో పరిస్థితిని భారత్ సమర్థంగా ఎదుర్కొందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ తెలిపారు. హర్మూజ్ జలసంధిని దాదాపు నాలుగు నెలలు మూసివేసినా దేశంలో ఇంధన సరఫరాపై ఎలాంటి ప్రభావం పడకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. టోల్ చెల్లించకుండానే 12కు పైగా ఎల్పీజీ నౌకలను హర్మూజ్ నుంచి తరలించామని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందని పురీ పేర్కొన్నారు. ముడిచమురు దిగుమతులను ఒక్క దేశానికే పరిమితం చేయకుండా పలు దేశాల నుంచి తెప్పించామని చెప్పారు. దీంతో దేశంలో వంటగ్యాస్, ఇంధన సరఫరాలో అంతరాయం ఏర్పడలేదన్నారు. సంక్షోభ సమయంలో దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని కూడా భారీగా పెంచామని వివరించారు. ఇంతకుముందు వంటగ్యాస్ ఉత్పత్తి చేయని రిఫైనరీలను కొద్ది రోజుల్లోనే మార్పులు చేసి ఎల్పీజీ తయారీకి సిద్ధం చేశామని చెప్పారు. దీంతో రోజుకు 35 వేల మెట్రిక్ టన్నులుగా ఉన్న ఉత్పత్తిని 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచగలిగామని తెలిపారు. వంటగ్యాస్ కొరత రాకుండా అల్జీరియా, జపాన్, కెనడా వంటి దేశాలతో కొత్త సరఫరా ఒప్పందాలు కుదుర్చుకున్నామని పురీ చెప్పారు. అమెరికా నుంచి అదనపు ఎల్పీజీ కార్గోలను కూడా తెప్పించామని వెల్లడించారు. దీంతో దేశీయ అవసరాలను పూర్తిగా తీర్చగలిగామని అన్నారు. ఇంధన ధరల భారం తగ్గించేందుకు కేంద్రం లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిందని గుర్తుచేశారు. అలాగే బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు వంటగ్యాస్ పంపిణీలో డిజిటల్ అథెంటికేషన్ విధానాన్ని తప్పనిసరి చేశామని చెప్పారు. ఈ చర్యల వల్ల ప్రపంచ ఇంధన సంక్షోభ ప్రభావం భారత వినియోగదారులపై పడకుండా కాపాడగలిగామని హర్దీప్ పేర్కొన్నారు.

## ఖమేనీ అంత్యక్రియలకు మోదీ దూరం



**మొదటిపేజీ తరువాయి -** ప్రధాని మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. అయితే ఆ సమయంలో ఇండోనేషియా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా పర్యటన ఇప్పటికే ఖరారు కావడంతో మోదీ హాజరు కాలేకపోతున్నారు. ఈ షెడ్యూల్ ముందుగానే ఖరారైం దని అధికార వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడిలో ఖమేనీ మరణించారు. తొలుత మార్చిలో అంత్యక్రియలు నిర్వహించాలని భావించారు. కానీ ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా వాటిని వాయిదా వేశారు. ఇప్పుడు జులైలో పలువురు దేశాధినేతలు, ప్రతినిధుల సమక్షంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జులై 4న టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లా సముదాయంలో ఖమేనీ భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. చివరి అంత్యక్రియలు జులై 9న ఖమేనీ స్వస్థలమైన మష్హద్‌లోని ఇమామ్ రెజా దర్గా వద్ద జరగనున్నాయి.

## భారీ వర్షాల ఎఫెక్ట్.. సీఎం రేవంత్ సభ రద్దు

**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు ప్రభుత్వ కార్యక్రమాలపైనా ప్రభావం చూపుతున్నాయి. ఖమ్మం జిల్లా మధిరలో మంగళవారం జరగాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'రైతు ఆశీర్వాద సభ'ను చివరి నిమిషంలో రద్దు చేశారు. వర్షాల కారణంగా సభను హైదరాబాద్‌కు మార్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మధిర నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సభను రద్దు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. సభను హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని 'రైతు భరోసా పంపిణీ సదస్సు'గా నిర్వహించనున్నారు. కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని మంత్రులు, ఉన్నతాధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులు ఇందులో పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాల్లోని రైతు వేదికల ద్వారా డిజిటల్, వర్చువల్ విధానంలో సమావేశాన్ని ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కల్పించనున్నారు.

# మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**అదే లక్ష్యంగా అందరం కృషి చేద్దాం**

**మన భావి భారత పౌరుల జీవితాలకు పూల బాటలు వేద్దాం**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**( చుక్క గంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ - జగిత్యాల) :** మత్తు రహిత సమాజ నిర్మాణం కోసం మనమంతా కలిసి కట్టుగా కృషి చేద్దామని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సాధికారత శాఖల ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడారు. మత్తు రహిత సమాజ నిర్మాణమే మన లక్ష్యంగా అందరం కృషి చేసి భావి భారత పౌరులైన మన పిల్లల భవిష్యత్ కోసం పూల బాటలు వేద్దామని ఆయన అన్నారు. విద్యార్థులతో కలిసి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించి, నషా ముక్త్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. యువత దేశ భవిష్యత్తు అని, వారు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న ఆశలు, నమ్మకాలను నిలబెట్టేలా ప్రతి విద్యార్థి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. "ఒక్కసారి మాత్రమే తీసుకుంటే ఏమవుతుంది" అనే నిర్లక్ష్య ధోరణే జీవితాన్ని నాశనం చేసే స్థాయికి తీసుకెళ్తుందన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన తర్వాత దాని నుంచి బయటపడటం ఎంతో కష్టమని మంత్రి హెచ్చరించారు. అందువల్ల ప్రతి యువకుడు మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కళాశాలలు, విద్యాసంస్థలు లేదా పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయం లేదా వినియోగం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే జిల్లా పోలీసు యంత్రాంగానికి సమాచారం అందించాలని మంత్రి సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తేనే మత్తు రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. అనుకోకుండా మత్తు పదార్థాలకు బానిసైన వారికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా వైద్య చికిత్స, కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అలాంటి వారు సంకోచించకుండా ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లు పాల్గొని ప్రసంగించారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, మున్సిపల్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పరిష్కారానికి నోచుకోని ప్రజావాణి ఫిర్యాదులు

**వారం - వారం పెరుగుతున్న పిర్యాదుల పుట్టలు**

**సోమవారం పలు సమస్యలపై వినతులు**

**స్వీకరించిన జిల్లా కలెక్టర్‌లు**

**( చుక్క గంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ - జగిత్యాల) :** ఎన్నెన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని ఎంతో దూరం నుండి ఏకంగా జిల్లా కలెక్టరేట్ కు తరలి వచ్చి సాక్షాత్తు జిల్లా కలెక్టర్ లకే ప్రజా వాణిలో పిర్యాదులు చేసినా అవి పరిష్కారానికి నోచుకోవడం లేదని జగిత్యాల జిల్లా ప్రజలు ఆరోపిస్తున్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన కలెక్టర్ ప్రజా వాణికి జిల్లా నలుమూలల నుండి బాధిత ప్రజలు తరలి వచ్చారు. తాము ఎన్ని సార్లు ఇంత దూరం వచ్చి పిర్యాదులు చేసినా.... అవి పరిష్కారానికి మాత్రం నోచుకోవడం లేదని పలువురు బాధిత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం - వారం కట్టల కొద్దీ పిర్యాదుల పుట్టలు పెరిగి పోతున్నాయి కానీ... జిల్లా ఉన్నతాధికారులు వాటిని పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే సమస్య పై పలు సార్లు పిర్యాదులు చేసినా ఫలితం శూన్యం తప్ప ఒరిగిందేమీ లేదని వాపోయారు. ఉన్నతాధికారులు మా పిర్యాదుల గూర్చి సరిగా పట్టించుకున్న పాపాన పోలేదని మహిళా బాధిత ప్రజలు చీవాట్లు పెట్టారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత అన్ని శాఖల ఉన్నతాధికారులకు ఖచ్చితమైన ఆదేశాలు లిఖిత పూర్వకంగా జారీ చేసి ప్రజా వాణి పిర్యాదులన్నీ పరిష్కారం అయ్యేలా చూడాలని వారు కోరారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ లు బి.ఎస్.లత, బి.రాజా గౌడ్ లు కలిసి 98 పిర్యాదులను బాధిత ప్రజల నుండి స్వీకరించారు. వీటన్నిటినీ ఆయా శాఖల అధికారులకు బదిలీ చేశారు. ప్రతీ సోమవారం ప్రజా వాణికి ఇలాగే వందలాది పిర్యాదులు రావడం - సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు బదిలీ కావడం మాత్రమే జరుగుతోంది కానీ.... వాటి పరిష్కారం మాత్రం కావడం లేదని బాధిత ప్రజల ఆరోపణ.

**కాగా...**

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాత్రం అదేశించారట. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి



పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం వచ్చిన 98 పిర్యాదులను ఆయా శాఖలకు బదిలీ చేశారు. అనంతరం ఇదివరకు ప్రజావాణి లో వచ్చిన 197 పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని లేని యెడల సంబంధిత జిల్లా అధికారి బాధ్యునిగా చేస్తూ మెమో జారీ చేయబడునని హెచ్చరిస్తూ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి ప్రసాద్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కీ.శే. ఏ.కె. విశ్వనాథ రెడ్డి 40వ వర్ధంతి వేడుకలు



**భీమదేవరపల్లి జూన్ 29( ప్రజా మంటలు) :** ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి,మార్కెటింగ్ సొసైటి లిమిటెడ్ సంఘ ఆవరణలో, సోమవారం నాడు సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు కీ.శే. ఏ.కె. విశ్వనాథ రెడ్డి 40వ వర్ధంతి కార్యక్రమము ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షులు ఎ. ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యములో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా సంఘ సీనియర్ సభ్యులైన వంగర గ్రామానికి చెందిన రఘునాయకుల బాల్ రెడ్డి,ముల్ నూర్ గ్రామానికి చెందిన దొంగల అయిలయ్యలు కీ.శే. ఏ.కె. విశ్వనాథ



రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సంఘ అధ్యక్షులు శ్రీ ఎ. ప్రవీణ్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సభలో ఉన్నవారంతా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు ఎ. ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ "గత 70 సంవత్సరాలుగా ముల్కనూర్ సహకార సంఘం సాధించిన ప్రగతికి కీ.శే. ఏ.కె. విశ్వనాథ రెడ్డి వేసిన బలమైన పునాదులే కారణమన్నారు . వారి ఆశయాల బాటలోనే నేడు సంఘం ఆధునిక సేవలను అందిస్తూ సభ్యులకు మరింత సమర్థవంతంగా సేవలందిస్తోందన్నారు . మన సంఘం యొక్క అభివృద్ధి, పారదర్శకత, వినూత్న సేవలను పరిశీలించేందుకు వివిధ అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు సైతం ములుకనూర్ ను సందర్శించడం మనకు దక్కిన విశిష్ట గుర్తింపన్నారు."భీమదేవరపల్లి మండలంలో అత్యధిక సంఖ్యలో బహిరంగ బావులు ఏర్పడటానికి సహకార సంఘం ప్రారంభ దశ నుంచే రైతులకు అందించిన వ్యవసాయ రుణాలే ప్రధాన కారణమని, వాటి ద్వారా రైతుల ఆదాయం పెరగడంతో పాటు వ్యవసాయాభివృద్ధికి బలమైన పునాది ఏర్పడిందని ఆయన వివరించారు. సహకార భావనను పరిరక్షించడం ప్రతి సభ్యుని బాధ్యత అని, సంఘ శ్రేయస్సుకు అందరూ ఐకమత్యంతో కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ జనరల్ మేనేజర్ మారుపాటి రాం రెడ్డి, ఉపాధ్యక్షులు జ్జి వీరయ్య, కార్యవర్గ సభ్యులు ఈర్ల మూగయ్య, కంది రవిందర్ రెడ్డి,అంబాల రాములు, బేల కనుకమ్మ, చెవ్వల్ల బుచ్చయ్య, గుగ్లోతు బాషు,బొల్లపెల్లి వీరా రెడ్డి, మంద శ్రీనివాస్, కర్రె మహేందర్, బొల్లంపెల్లి కుమారస్వామి, గనెబోయిన శ్రీనివాస్, గుర్రాల భాస్కర్ రెడ్డి, కాశిరెడ్డి వసంత,సంఘ సభ్యులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

# నిరుద్యోగులతో ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం

**కలిసి తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**

**హైదరాబాద్, జూన్ 29 (ప్రజా మంటలు) :** ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయాలని, రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత సోమవారం దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాలో నిరుద్యోగులతో కలిసి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం స్పందించే వరకు నిరుద్యోగుల వెన్నంటి ఉంటానని ఆమె ప్రకటించారు. ధర్నాలో మాట్లాడుతూ, నిరుద్యోగులతో విభేదించిన ఏ ప్రభుత్వం కూడా నిలదొక్కుకోలేదని అన్నారు. ఎన్నికల సమయంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు సుమారు 11 వేల ఉద్యోగాలనే భర్తీ చేసిందని విమర్శించారు. కానిస్టేబుల్ పోస్టుల విషయంలో ప్రభుత్వం గతంలో 19 వేలకుపైగా ఖాళీలు ఉన్నాయని ప్రకటించి, ఇప్పుడు కేవలం 5 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం అన్యాయమని పేర్కొన్నారు. కనీసం 20 వేల కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కానిస్టేబుల్ పోస్టులకు 36 సంవత్సరాలు, ఎస్సై పోస్టులకు 38 సంవత్సరాల వరకు ఏజ్ రిలాక్సేషన్ ఇవ్వాలని కోరారు. గతంలో ఏజ్ రిలాక్సేషన్ ఇచ్చి, ఇప్పుడు కొత్త జీవో ద్వారా దానిని తొలగించడం



నిరుద్యోగులను మోసం చేయడమేనని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తర్వాత పోలీసు నియామకాలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయడంలో తాను కూడా పాత్ర పోషించానని చెప్పారు. ప్రస్తుతం ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న మహిళల ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. మూసీ అభివృద్ధి ప్రాజెక్టుపై కూడా ఆమె విమర్శలు చేశారు. ప్రజలు ఉద్యోగాలు కోరుతుంటే వేల కోట్ల రూపాయలతో మూసీ ప్రాజెక్టును చేపట్టడం కంటే ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యం



ఇవ్వాలని అన్నారు. పేదల ఇళ్లను తొలగిస్తూ ప్రాజెక్టు చేపట్టాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. జులై 2న నిరుద్యోగులు చేపట్టనున్న సచివాలయం ముట్టడి కార్యక్రమానికి అవసరమైతే తమ ఉద్యమకారులు కూడా మద్దతు ఇస్తారని తెలిపారు. నిరుద్యోగులు ఒంటరివారు కాదని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని స్పష్టం చేశారు. చివరగా, ఎన్నికల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు.

## ఆర్థిక సాయం అందజేసిన గల్ఫ్ సేవా సమితి



**బుగ్గారం / జగిత్యాల జిల్లా, ( ప్రజా మంటలు) :** జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలోని గల్ఫ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఇటీవల గుండెపోటుతో గల్ఫ్‌లో కన్నుమూసిన సాటి గల్ఫ్ కార్మికుడు పులి మహేష్ కుటుంబానికి సోమవారం రూ. 72,100 (డెబ్బై రెండు వేల వంద రూపాయలు) ఆర్థిక సాయం అందజేశారు. వారి వంతు సహాయంగా గల్ఫ్ కార్మికులందరం కలిసి తల కొంత డబ్బు సేకరించి మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయంగా అందించారు. అమరుడైన మహేష్ లేని లోటు ఎప్పటికీ తీరనిదని అన్నారు. మహేష్ మంచి తనం గూర్చి గుర్తు చేసుకున్నారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మేము అందించిన ఈ చిన్న సహాయం వారి బాధను తీర్చలేకపోయినా, కష్టకాలంలో వారు ఒంటరిగా లేరనే భరోసాను అందిస్తుందని విశ్వసిస్తున్నామని పేర్కొన్నారు. భగవంతుడు మహేష్ ఆత్మకు శాంతిని ప్రసాదించి, వారి కుటుంబ సభ్యులకు ఈ తీరని విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని మనస్ఫూర్తిగా వారంతా కోరుకున్నారు. ఈ సేవాకార్యంలో భాగస్వాములై తమ వంతు సహాయాన్ని అందించిన ప్రతి ఒక్క గల్ఫ్ సేవా సమితి -- బుగ్గారం సభ్యులకు కార్యవర్గం, గ్రామ ప్రముఖులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## భీమదేవరపల్లి మండలంలో నేరాల నియంత్రణకు సిసి కెమెరాల ఏర్పాటు

**ముల్కనూర్ పోలీస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు**





**భీమదేవరపల్లి, జూన్ 29: (ప్రజా మంటలు ) :** భీమదేవరపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ కొరకు సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ముల్కనూర్ ఎస్సై రాజు ఆధ్వర్యంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు,ఆయా గ్రామాల సర్పంచ్‌లతో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాల్లో సిసి కెమెరాల ప్రాముఖ్యతను, వాటి ద్వారా జరిగే భద్రతా ప్రయోజనాలను ప్రజాప్రతినిధులకు, అధికారులకు వివరించడం జరిగింది. ప్రతి గ్రామంలోని ముఖ్య కూడళ్లు, ప్రజలు ఎక్కువగా తిరిగే ప్రాంతాలను గుర్తించి త్వరగతిన సిసి కెమెరాల ఏర్పాటు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీరేశం ఎంపీఓ, నాగరాజు,ఎమ్మార్వో రాజేష్,ముల్కనూర్ ఎస్సై రాజు,వంగర ఎస్సై దివ్య, పాల్గొని,గ్రామాల్లో సిసి కెమెరాల ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికలపై చర్చించారు. గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు పోలీసు వారికి సహకరించి మండల భద్రతకు భాగస్వాములు కావాలని అధికారులు కోరారు.

## ఒక్క సీసీ కెమెరా 100 మందితో సమానం.. సీఐ పులి రమేష్..



**ఎల్కతుర్తి. జూన్ 29. ప్రజా మంటలు :** ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్లో 20 గ్రామాల సర్పంచులకు సీసీ కెమెరాలు గురించి అవగాహన సదస్సు తెలిపిన సీఐ పులి రమేష్ ఒక్క సీసీ కెమెరా100 మందితో సమానమని సీఐ పులి రమేష్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై నరసింహ రావు ఆధ్వర్యంలో 20 గ్రామపంచాయతీ సర్పంచులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిఐ మాట్లాడుతూ, సర్పంచులందరూ గ్రామములో తప్పనిసరి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం అన్నారు. దానివల్ల దొంగతనాలు గాని, ఇతరత్రా ఎలాంటి సంఘటన జరిగిన వెంటనే తెలిసిపోతుందన్నారు. అలాగే గ్రామాల్లో మత్తు పదార్థాలు, గంజాయి బారిన పడకుండా యువతను కాపాడాల్సిన బాధ్యత సర్పంచులపై ఉందన్నారు. ఒక్క పోలీసులదే బాధ్యత కాకుండా గ్రామంలోని ప్రతి పౌరుని బాధ్యతగా ఉండాలని సూచించారు. సర్పంచులు పోలీసులు కలిసి అవగాహనతో గ్రామంలో శాంతిభద్రతలు నెలకొల్పే విధంగా సహకరించుకుందాం అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు శ్రీధర్ రావు, స్థానిక సర్పంచ్ మునిగడప లావణ్య ముప్పు లావణ్య, బొంకురి రజిత రవీందర్, నీలా, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గంగాదేవిపల్లెలో నూతన అంగన్ వాడీ భవనాన్ని ప్రారంభించిన మంత్రి అడ్లూరి



**గొల్లపల్లి జూన్ 29 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండలం గంగాదేవిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్ వాడీ భవనాన్ని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి సోమవారం అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్నారుల సమగ్ర వికాసానికి, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించడంలో అంగన్ వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన మౌలిక వసతులు కల్పిస్తూ, ప్రతి చిన్నారికి మెరుగైన విద్య, పోషకాహారం, ఆరోగ్య సేవలు అందేలా కృషి చేస్తోందని పేర్కొన్నారు. నూతన అంగన్వాడి భవనం ద్వారా గ్రామంలోని చిన్నారులు, మహిళలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నూతన యూనిఫాం అందజేశారు ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ వైస్ చైర్మన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కార్యదర్శి డైరెక్టర్లు సర్పంచులు ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య



**గొల్లపల్లి జూన్ 29 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండలం కేంద్రంలో లోని అనవేని లక్ష్మణ్ (55) ధర్మారం ఎమ్మార్వో కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడు గత మూడు సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతూ జగిత్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతునికి పక్షవాత అనారోగ్య కారణంగా తీవ్ర మానసిక వేదనకు గురై, జీవితంపై విరక్తి చెంది తన నివాసం వెనుక ఉన్న మామిడి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడఅని మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.

## ప్రిన్సిపాల్‌పై దాడి.. నిజామాబాద్ బీజేపీ నేత బాలు అరెస్ట్



స్కూల్‌లో ఉర్దూ బోధించడంపై చెలరేగిన వివాదం తీవ్రరూపం దాల్చింది. ప్రిన్సిపాల్‌పై దాడి చేసినందుకు గాను నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణ బీజేపీ అధ్యక్షుడు మందుల బాలును సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై తీవ్ర దుమారం రేగడంతో పోలీసులపై ఒత్తిడి పెరిగింది. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డికి చెందినదిగా చెబుతున్న అంకాపూర్‌లోని ఒక గెస్ట్ హౌస్‌లో ఉన్న బాలును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో బాలు, అతని మద్దతుదారులు పోలీసులను ప్రతిఘటించడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు బాలును బలవంతంగా వాహనంలోకి ఎక్కించి తీసుకెళ్లారు. వివరాల్లోకి వెళితే, జూన్ 27న ఆర్మూర్‌లోని భారత్ చంద్ర స్కూల్ ప్రిన్సిపాల్ అమెర్ ఖాన్‌పై మందుల బాలు, అతని మద్దతుదారులు దాడి చేశారు. స్కూల్‌లో ఉర్దూ బోధించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక పోలీస్ అధికారి సమక్షంలోనే బాలు ప్రిన్సిపాల్‌ను చెంపపై కొట్టడం, దుర్భాషలాడటం వంటి దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో పోలీసుల తీరుపై, బీజేపీ నేత తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఉర్దూతో పాటు విద్యార్థులకు నమాజ్ వంటి మతపరమైన పద్ధతులు నేర్పుతున్నారని బీజేపీ నేతలు ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను స్కూల్ యాజమాన్యం ఖండించింది. కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు ఉర్దూను రెండో భాషగా ప్రవేశపెట్టాలని యాజమాన్యం నిర్ణయించిందని స్కూల్ కరస్పాండెంట్ మల్లయ్య వివరించారు. ఈ ఘటనపై స్కూల్ కరస్పాండెంట్ మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు బాలుపై స్కూల్లోకి నేరపూరిత చొరబాటు, దాడి, ఇతర సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అదే సమయంలో, ఆర్మూర్ తహసీల్దార్ సత్యనారాయణ.. స్కూల్ ప్రిన్సిపాల్, కరస్పాండెంట్‌పై వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారంటూ కౌంటర్ కేసు నమోదు చేయడం గమనార్హం. ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి స్పందిస్తూ, ఉర్దూ ఒక గొప్ప భాష అని, తెలంగాణ చరిత్ర, సంస్కృతిలో భాగమని అన్నారు. దాన్ని అడ్డుకునే హక్కు బీజేపీకి లేదని ఆమె వ్యాఖ్యానించారు.

ప్రజా మంటలు

మంగళవారం 30 - 06 - 2026

# నేటి యువత వేగంగా లక్ష్యాలను చేరాలనే ఆరాటంలో ఉంది

### బీజేపీ చీఫ్ నితిన్ నబీన్



పార్టీలు, నాయకులు ఇచ్చిన హామీలను ప్రజలు గుర్తుంచుకుంటారు - యువత ఎప్పుడూ వాస్తవికత గుర్తించి పనిచేయాలి - వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్?తోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని సంపూర్ణ విశ్వాసం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోని యువత రాజకీయాల్లోకి రావాలన్న ఆయన వచ్చాక ఏం చేస్తారో ఓ స్పష్టత ఉండాలని సూచించారు. గతంలో మానవ హక్కుల గురించి ప్రజలకు అంతగా తెలిసేది కాదన్న నితిన్ సోషల్ మీడియా వచ్చాక ప్రజల్లో చైతన్యం పెరిగిందన్నారు. హక్కులు, విధుల పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.మేడ్చల్-మల్కాజ్ గిరి జిల్లాలోని ఘట్‌కేసర్ వీబీఐటీ క్యాంపస్‌లో బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్?లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంక్లేవ్‌లో నల్సార్, ఐఎస్‌బీ, హెచ్‌సీయూ, కేయూ, ఓయూ, ఐఐటీ, ఐఐఐటీ, ఎన్ఐటీ, ఇఫ్లూ, బిట్స్ విద్యార్థులు పాల్గొన్నారు.12 ఏళ్ల మోదీ పాలనపై చర్చ : ఈ కాంక్లేవ్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్, తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్‌రావు, ఎంపీ డీకే అరుణ, అభయ్ పాటిల్, ఆశిష్ సెల్లార్, రేఖా శర్మ, చంద్రశేఖర్ తివారీ పాల్గొన్నారు. భారత్-భవిష్యత్ సవాళ్లు అనే అంశంపై విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు నితిన్ నబీన్ ఇచ్చారు. 2047-వికసిత్ భారత్ లక్ష్యం, 12 ఏళ్ల మోదీ పాలనపై చర్చ జరిగింది. అంతకుముందు కళాశాల ఆవరణలో నితిన్ నబీన్ మొక్కను నాటారు.మొదట్లో అంతా గందరగోళంగా ఉండేది : రాజకీయాల్లో ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారని కేయూ విద్యార్థి శ్రీజ నితిన్ ?నబీన్?ను ప్రశ్నించారు. దీంతో ఆయన స్పందిస్తూ చిన్న వయసులోనే అనుకోకుండా రాజకీయాల్లోకి వచ్చానని, మొదట్లో తన భవిష్యత్తుపై అంతా గందరగోళంగా ఉండేవాడినని చెప్పారు. ఏ పని చేసినా తనదైన ముద్ర ఉండాలని గట్టిగా అనుకున్నట్లు పేర్కొన్నారు. జీవితం వంద మీటర్ల పరుగు పందెం కాదని మన ఓపికకు పరీక్ష అని తెలిపారు. అప్పగించిన పనిని నిబద్ధతతో పూర్తి చేయడమే తన ప్రధాన బలమన్నారు. కానీ వేగంగా లక్ష్యాలు చేరాలనే ఆరాటంలో నేటి యువత ఉందని తెలిపారు. ఏ పనినైనా ఓపిక, నిలకడ, శక్తితో చేసినప్పుడే ఫలితాలు వస్తాయని అన్నారు. నేటి యువత ఎప్పుడూ వాస్తవికత గుర్తించి పనిచేయాలన్న ఆయన రీల్స్, షార్ట్స్ చూసి ఎవరూ నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. జీవితంలో నిర్ణయం తీసుకునేందుకు నాణ్యమైన సమయం తీసుకోవాలని సూచించారు. వాస్తవికత ఆధారంగా నిర్ణయాలు తీసుకోని, పని మొదలు పెట్టాలన్నారు.కాంగ్రెస్ వాగ్దానాలపై ప్రశ్న : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన పరిశోధక విద్యార్థి ఆంజనేయులు 2023 కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఏం వాగ్దానం చేసింది? ప్రభుత్వ ఉద్యోగాలు 2 లక్షలు, నిరుద్యోగ యువతకు నెలకు రూ. 4 వేల ఆర్థిక సాయం ప్రకటించి ఇవేవి చేయకుండా సరిపెట్టే ప్రభుత్వాన్ని మీరు ఎలా చూస్తారు? అని అడిగారు.ప్రజలు అన్నీ గుర్తుంచుకుంటారు : నితిన్ ఈ ప్రశ్న మాట్లాడుతూ మన దేశ ప్రజలు, మన యువత, మన ప్రస్తుత తరం వారు1980ల నుంచి 2000ల మధ్య కాలంలో తమ హక్కుల గురించి అంతగా అవగాహన కలిగి ఉండేవారు కాదని కంప్యూటర్లు, సోషల్ మీడియా రాకతో అవగాహన పెరగి, ప్రతి ఒక్కరూ తమ హక్కులు, విధులు బాధ్యతల పట్ల మరింత సున్నితంగా మారారని చెప్పారు. అవగాహన అనేది నిస్సందేహంగా ప్రజలను మేల్కొల్పిందని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులుగా, మనం ఏదైనా చెప్పి, ప్రజలు దానిని మరచిపోయేలా చేసే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. ప్రజలు అన్నీ అంశాలు గుర్తుంచుకుని సరైన సమయంలో తిరిగి ప్రతిస్పందస్తారని జవాబిచ్చారు. ఇది తనతో పాటు బీజేపీ సహా అన్ని పార్టీలకు వర్తిస్తుందని స్పష్టం చేశారు.

# తెలంగాణలోని పల్లెల్లో హ్యామ్ రోడ్ల పనులు

### పంచాయతీరాజ్ శాఖ నివేదిక

జులై 2తో టెండర్ల ప్రక్రియ పూర్తి - వెంటనే నిర్మాణాలు ప్రారంభం - ప్రభుత్వానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నివేదిక - హ్యామ్ విధానం కింద గ్రామీణ ప్రాంతాల్లో రూ.6,294.81 కోట్ల టెండర్లుతెలంగాణ రాష్ట్రంలోని నగర, పట్టణ ప్రాంతాల్లో హ్యామ్(హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రోడ్ల పనులకు ప్రభుత్వం ఆదివారం శ్రీకారం చుట్టగా గ్రామీణ ప్రాంతాల్లో అవి వచ్చే జులై నెలలో ప్రారంభం కానున్నాయి. టెండర్ల ప్రక్రియ జులై రెండో తేదీతో ముగుస్తుందని ఆ వెంటనే రోడ్ల నిర్మాణ పనులు చేపడతామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ వెల్లడించింది. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వానికి రిపోర్టు సమర్పించింది.17 ప్యాకేజీలుగా విభజించిన ప్రభుత్వం : పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో హ్యామ్ మోడల్ కింద రూ.6,294.81 కోట్లతో 7,449.50 కిలోమీటర్ల పొడవున్న 2,162 రోడ్ల నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ పనులను 17 ప్యాకేజీలుగా విభజించి సర్కారు టెండర్లకు పిలిచింది. ఇందులో 14 ప్యాకేజీలకు టెండర్ల ప్రక్రియ పూర్తయి కాంట్రాక్టు సంస్థలకు పర్మిషన్లు జారీ అయ్యాయి. మరో ప్యాకేజీ టెండర్ అనుమతి దశలో ఉండగా మిగిలిన రెండు ప్యాకేజీలకు వచ్చేనెల 2న టెండర్ ప్రక్రియ ముగుస్తుంది. ఆ వెంటనే ఒకే దఫాలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పనులను వేగంగా ప్రారంభించనున్నారు.30 నెలల్లో పూర్తిచేసేలా : నిబంధనల ప్రకారం టెండర్లు పొందిన కాంట్రాక్టు సంస్థలు 30 నెలల వ్యవధిలో తమ ప్యాకేజీల పరిధిలో నిర్మాణాలను పూర్తి చేయాలి. అనంతరం 15 ఏళ్లపాటు వాటిని సక్రమంగా నిర్వహించాలి. వివిధ దశల్లో సాధించిన పురోగతి ఆధారంగా, ప్రభుత్వం నిర్మాణ కాలంలో ప్రాజెక్ట్ వ్యయంలో 40 శాతం మొత్తాన్ని (4% చొప్పున పది సమాన వాయిదాల్లో) చెల్లింపులు చేస్తుంది. మిగిలిన 60 శాతం ప్రాజెక్ట్ వ్యయాన్ని 15 సంవత్సరాల నిర్వహణ కాలంలో ప్రతి ఆరు నెలలకోసారి ఇస్తారు. ఈ చెల్లింపుల్లో ఒప్పంద నిబంధనల మేరకు ధరల పెరుగుదల, వడ్డీ, ఇతర వర్తించే ఖర్చులు కూడా కలిసే ఉంటాయి.రూ.13 వేల కోట్ల అంచనా వ్యయంతో : రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించిన పైలాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం నల్గొండ జిల్లా కనగల్‌లో ఆవిష్కరించారు. హ్యామ్ విధానం ద్వారా రాష్ట్రంలో రూ.13,006 కోట్ల అంచనాతో 441 రహదారులను ఉన్నతీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా కేవలం నల్గొండ జిల్లాలో సుమారు రూ.1,100 కోట్లకు పైగా నిధులతో రోడ్లను అధునాతన పద్ధతుల్లో అభివృద్ధి చేయనున్నారు.




# మామ-అల్లుడిని బైకుకు తాళ్లతో కట్టి నీళ్లలో పడేసి

### లభ్యమైన మృతదేహాలు

### కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలంలో కలకలం

### చిన్నగొల్లపాలెం గ్రామంలో అంతుపట్టని విషాదం

### శనివారం రాత్రి చేపల వేటకు వెళ్లిన మామాఅల్లుళ్ల మృతి

### ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా చేపలు



కృష్ణా జిల్లాలో ఇద్దరు వ్యక్తుల అనుమానాస్పద మృతి స్థానికంగా భయాందోళనలు సృష్టిస్తోంది. చేపల వేటకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు విగతజీవులుగా మారారు. అదీ సాధారణ మరణం కాదని, వారిని అంతమొందించి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక గ్లామర్ బైకుకు వారి మృతదేహాలను తాళ్లతో కట్టేసి కాలువలో పడేయడం ఈ ఘటన తీవ్రతకు అద్దం పడుతోంది. పోలీసుల తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.చేపల వేట, ప్రాణాల మీదకు : కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం చిన్న గొల్లపాలెం గ్రామం. అక్కడ యానాది కులానికి చెందిన శెట్టి సుబ్బన్న (51), గొలుసు అయ్యప్ప (40) నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ వరసకు మామా అల్లుళ్లు. వీరు రోజూ చేపల వేటకు వెళ్తుంటారు. ఆ వేటే వారి కుటుంబాలకు ప్రధాన జీవనాధారం. ఎప్పటిలాగే శనివారం రాత్రి కూడా వారు వేటకు బయలుదేరారు. రాత్రి సుమారు 8 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లారు. కానీ, అదే వారి చివరి ప్రయాణం అవుతుందని ఆ కుటుంబాలు ఏమాత్రం ఊహించలేదు.రాత్రి వేటకు వెళ్లిన మామాఅల్లుళ్లు మరుసటి రోజు ఉదయం అయినా తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యుల్లో ఆందోళన మొదలైంది. ఆదివారం ఎంతసేపటికీ వారు రాకపోవడంతో సుబ్బన్న కుమారుడు శెట్టి ఏడుకొండలు వారిని వెతుక్కుంటూ బయలుదేరాడు. వారు రోజూ చేపలు పట్టే ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ పరిసరాలను జాగ్రత్తగా గమనించాడు.చెదిరిన చేపలు : ఏడుకొండలు ఆ ప్రాంతంలో చూసిన దృశ్యాలు అతడిని భయపెట్టాయి. వారు వేటాడి పట్టుకున్న చేపలు అక్కడ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. అక్కడికి కొంత దూరంలో నేల మీద కొన్ని రక్తపు మరకలు కూడా కనిపించాయి. అక్కడే ఒక మొబైల్ ఫోన్ కూడా కింద పడి ఉంది. వెంటనే ఏడుకొండలు మిగతా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. గ్రామస్థులు కూడా అక్కడికి చేరుకున్నారు. అంతా కలిసి పరిసరాల్లో గాలించినా వారి ఆచూకీ దొరకలేదు. దీంతో ఆదివారం రాత్రి కృత్తివెన్ను పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. తన తండ్రి, బావ అదృశ్యమయ్యారని ఏడుకొండలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు వెంటనే మిస్సింగ్ కేసు నమోదు చేశారు.తాళ్లతో మృతదేహాలు : పోలీసుల గాలింపులో సోమవారం షాకింగ్ దృశ్యం బయటపడింది. కొత్త కాలువ ఏటి మొగ పాయల వద్ద నీటిలో ఒక బైక్ ఉన్నట్లు గుర్తించారు. ఆ బైకుకు తాళ్లతో కట్టేసిన స్థితిలో రెండు మృతదేహాలు ఉన్నాయి. అవి గల్లంతైన సుబ్బన్న, అయ్యప్పల మృతదేహాలేనని పోలీసులు నిర్ధారించారు. వెంటనే గ్రామస్థుల సహాయంతో పోలీసులు ఆ మృతదేహాలను కష్టపడి బయటకు తీశారు.హత్యా ఇంకేదైనా జరిగిందా : ఈ ఘటన ఇప్పుడు ఆ ప్రాంతంలో కలకలం రేపుతోంది. బైకుకు తాళ్లతో కట్టేసి నీళ్లలో పడేశారంటే ఇది హత్యేనని స్థానికులు అనుమానిస్తున్నారు. ముందుగా వారిని కొట్టి చంపి ఉంటారని భావిస్తున్నారు. ఆ తర్వాత ఆధారాలు మాయం చేసేందుకు, మృతదేహాలు పైకి తేలకుండా ఉండేందుకు ఇలా బైకుకు కట్టి నీళ్లలో పడేసి ఉంటారని చర్చించుకుంటున్నారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి లోతుగా విచారిస్తున్నారు. పాత కక్షలు ఏమైనా ఉన్నాయా? అన్న కోణంలోనూ విచారణ సాగుతోంది. ఈ ఘటనతో చిన్న గొల్లపాలెం గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ దారుణానికి ఒడిగట్టిన నిందితులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# రాధా గాయత్రి తల్లిదండ్రులకు సహాయ సహకారాలు అందిస్తాం

### హోంమంత్రి అనిత



విశాఖలో హోంమంత్రి అనితను కలిసిన రాధాగాయత్రి తల్లిదండ్రులు - న్యాయం చేయాలని హోంమంత్రిని కోరిన వైనం - న్యాయం చేస్తామని హోంమంత్రి హామీ ఇచ్చారన్న రాధా గాయత్రి తల్లి ఉత్తరాఖండ్‌లోని మసూరీలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన టెకీ రాధా గాయత్రి తల్లిదండ్రులు హోంమంత్రి అనితను కలిశారు. విశాఖలోని పోలీస్ కమిషనరేట్‌లో ఆమెను కలిశారు. తమ కుమార్తె మృతి, అల్లుడు శ్రీచరణ్ ప్రవర్తనపై ఉన్న అనుమానాలను అనితకు వారు వివరించారు. ఈ కేసులో న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికే అక్కడి పోలీసులతో ఇంఛార్జ్? జాయింట్ సీపీ మాట్లాడి కేసుపై వివరాలు తీసుకున్నారని రాధా గాయత్రి తల్లిదండ్రులకు హోంమంత్రి తెలియజేశారు. ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని వారికి అనిత భరోసా ఇచ్చారు.ఈ కేసుపై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. ఉత్తరాఖండ్ డీజీపీతో మాట్లాడాలని రాష్ట్ర డీజీపీకి సూచించినట్లు చెప్పారు. రాధా గాయత్రి మరణంపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. నిందితుడికి కఠిన శిక్ష పడాలన్నారు. రాధా గాయత్రి తల్లిదండ్రులకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని అనిత భరోసా ఇచ్చారు.హోంమంత్రిని కలిసిన అనంతరం రాధా గాయత్రి తల్లి సత్యవతి మీడియాతో మాట్లాడారు. తమకు అండగా ఉంటామని అనిత భరోసా ఇచ్చారని పేర్కొన్నారు. ఈ విషయం సీఎం చంద్రబాబు వరకు వెళ్లిందని ఆమె చెప్పారని తెలిపారు. తాము చెప్పినవన్నీ హోంమంత్రి విని చాలా బాగా స్పందించారని వివరించారు. తాము అన్ని చూసుకుంటామని మీరు ధైర్యంగా ఉండాలని అనిత తెలియజేశారని సత్యవతి వెల్లడించారు.అసలేం జరిగిందంటే : విజయనగరం జిల్లా మామిడిపల్లికి చెందిన సుధాకర్, సత్యవతి దంపతులకు ఒక్కగానొక్క కుమార్తె రాధా గాయత్రి. తండ్రి ఆర్మీ విశ్రాంత ఉద్యోగి. చిన్నతనం నుంచి గాయత్రి చదువులో చురుకుగా ఉండేది. ఆరు నుంచి పది వరకు పెందుర్తిలో, ఎంకామ్, ఎంబీఏ ఆంధ్రా యూనివర్సిటీలో పూర్తిచేసింది. సోషియాలజీలో పీహెచ్‌డీ చేసింది. క్యాంపస్ ఇంటర్వ్యూలో దిల్లీలో ఉద్యోగానికి ఎంపికైంది. గత సంవత్సరం నవంబర్ 8న విశాఖకు చెందిన శ్రీచరణ్‌తో ఆమెకు వివాహమైంది.దంపతులిద్దరూ గురుగ్రామ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్నారు. విహారయాత్ర కోసం ఉత్తరాఖండ్ వెళ్లారు. కన్నవారింట్లో జూన్ 21, 22న వ్రతం, ఇతర పూజా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించడంతో కుటుంబసభ్యులకు ఫోన్ చేసి ఈ నెల 17 కల్లా వస్తానని గాయత్రి చెప్పింది. ఇంతలో ఏమైందో కానీ జూన్? 15న గాయత్రి ముస్సోరిలోని ఓ హోటల్ రూమ్‌లో అనుమాన్పద స్థితిలో మరణించినట్లు ముస్సోరీ పోలీసులు గుర్తించారు. ముక్కు నుంచి రక్తం రావడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# దుబ్బాక పట్టణ కేంద్రంలో భారీ చోరీ

### కిలో బంగారం ఎత్తుకెళ్లిన దొంగలు!



9 రోజుల క్రితం తన కుటుంబ సభ్యులతో కలిసి కాశీకి వెళ్లిన బాధితుడు కిటికీ ఊచలను ధ్వంసం చేసి ఇంటిలోనికి ప్రవేశించిన దొంగలు - బెడ్?రూంలోని లాకర్‌ను పగులగొట్టి బంగారం, నగదు స్వాహా సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణం కేంద్రంలో భారీ చోరీ జరిగింది. 15వ వార్డులోని ఓ ఇంట్లోకి దొంగలు చొరబడి పెద్ద ఎత్తున నగదు, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం, దుబ్బాక పట్టణానికి చెందిన చింత రాజ్‌కుమార్ అనే మెడికల్ ఏజెన్సీ నిర్వాహకుడు 9 రోజుల క్రితం తన కుటుంబ సభ్యులతో కలిసి కాశీ యాత్రకు వెళ్లారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి ఇంటి కిటికీ ఊచలను ధ్వంసం చేసి దొంగలు లోనికి ప్రవేశించారు. బెడ్?రూంలోని లాకర్‌ను పగులగొట్టి అందులో ఉన్న బంగారం, నగదును ఎత్తుకెళ్లారు.పని మనిషి చూడటంతో వెలుగులోకి : ఈ ఘటనలో చోరీకి గురైన బంగారం సుమారు కేజీ వరకు ఉన్నట్లు సమాచారం. సోమవారం ఉదయం ఇంటి ఆవరణను పరిశుభ్రం చేసేందుకు వచ్చిన పని మనిషి మంజుల అనే మహిళ ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటం చూసి యజమానికి సమాచారం అందించడంతో విషయం వెలుగు చూసింది. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తన సిబ్బందితో అక్కడికి చేరుకొని క్లూస్ టీమ్‌తో దర్యాప్తు చేస్తున్నారు. పట్టణ కేంద్రంలో భారీ చోరీ జరగడంతో సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించి క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలించారు.

# సాయికృష్ణ మృతి కేసులో కీలక పరిణామం

### లొంగిపోయిన హెడ్‌కానిస్టేబుళ్లు అశోక్, నాని

### సాయికృష్ణ మృతి కేసులో కీలక పరిణామం

### సూర్యారావుపేట ఏసీపీ కార్యాలయంలో లొంగిపోయిన అశోక్, నాని

### హెడ్‌కానిస్టేబుళ్లను కమాండ్ కంట్రోల్‌లోని సిట్ కార్యాలయానికి తరలింపు

### సిట్ కార్యాలయంలో హెడ్‌కానిస్టేబుళ్లను విచారిస్తున్న అధికారులు



సాయికృష్ణ మృతి, మిస్సింగ్ మిస్టరీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కృష్ణలంక పీఎస్‌లో హెడ్‌కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న అశోక్, నాని సూర్యారావుపేట ఏసీపీ కార్యాలయంలో ఇవాళ లొంగిపోయారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సీఐ నాగరాజుకు వీరిద్దరూ వెన్నంటి ఉండేవారు. సీఐ అరెస్ట్ తర్వాత ఈ ఇద్దరు అజ్ఞాతంలోకి వెళ్లారు. సాయికృష్ణ కేసులో సీఐ నాగరాజుకు వీరు సాయం చేశారని సిట్ గుర్తించింది. ఈ క్రమంలోనే లొంగిపోయిన నాని, అశోక్?ను కమాండ్ కంట్రోల్‌లోని కమాండ్ కంట్రోల్‌లోని సిట్ కార్యాలయానికి తరలించారు. అక్కడికి సిట్ చీఫ్, ఐజీ రవిప్రకాశ్, ఎస్పీలు అమిత్ బర్దర్, నయీం అద్నాన్ అస్మీ చేరుకొని వారిని విచారిస్తున్నారు.కృష్ణలంక స్టేషన్ పరిధిలోని లాడ్జీలు, బార్లు, మద్యం దుకాణాలు ఇతరత్రా కార్యకలాపాలకు సంబంధించిన వ్యవహారాలను అశోక్ చక్కదిద్దేవాడు. అంతేకాక పలు సెటిల్?మెంట్లకు పాల్పడేవాడని ఆరోపణలున్నాయి. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, పాత నేరస్థులతో సఖ్యంగా ఉండటం, బెదిరింపులకు పాల్పడటం, నేరస్థులను స్టేషన్‌కు తీసుకురావడం వంటి పనులను నాని చేసేవాడు. నాని పటమట స్టేషన్‌లో పనిచేసినప్పుడు స్పా సెంటర్ల విషయంలో ఆరోపణలు రావడంతో వీఆర్‌కు పంపించారు. గన్నవరం స్టేషన్‌లో పనిచేసినప్పుడు ఓ మిస్సింగ్ కేసులో ఆత్కూరు స్టేషన్ ఎస్సైని అని చెప్పి డబ్బులు వసూలు చేసిన వ్యవహారంలో సస్పెండయ్యాడు.మరోవైపు సీఐ నాగరాజుకు సన్నిహితంగా మెలిగిన ప్రైవేట్ వ్యక్తి సురేశ్? కూడా వీరితో కలిసి రౌడీషీటర్ల కౌన్సెలింగ్, నిందితుల విచారణ, తదితర వ్యవహారాల్లో జోక్యం చేసుకునేవాడని తేలింది. గత నెల 29న సాయికృష్ణ బంధువులను కలిసేందుకు ఈ ముగ్గురూ గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరం వెళ్లారని సిట్ అధికారులు గుర్తించారు. సురేశ్?ను సిట్ ఇప్పటికే అదుపులోకి తీసుకుంది.మరోవైపు సాయికృష్ణ మృతదేహం ఆచూకీ కోసం రవిప్రకాశ్? ఆధ్వర్యంలోని సిట్ కృష్ణలంకలోని స్వర్గపురితోపాటు విజయవాడ నగరం, చుట్టుపక్కల కృష్ణా, గుంటూరు జిల్లాల సరిహద్దుల్లో ఉన్న శ్మశానవాటికల్లోనూ విచారిస్తున్నారు. కృష్ణలంక స్టేషన్‌లో కొందరు సిబ్బందిని పిలిచి శుక్రవారం నాడు విచారించారు. కొందరి సమాధానాలు అనుమానాస్పదంగా ఉండటంతో మరికొందరి పాత్ర కూడా ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

# రూ.30 వేల కోట్ల బకాయిలు ఇవ్వకపోతే భారీ ఉద్యమం తప్పదు బొప్పరాజు



ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కీలక డిమాండ్లు - ఉద్యోగ సంఘాలను చర్చలకు పిలవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి - పెండింగ్‌లో ఉన్న రూ. 30 వేల కోట్ల బకాయిలు చెల్లించాలి రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థికపరమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. తక్షణమే ఉద్యోగ సంఘాలను అధికారికంగా చర్చలకు ఆహ్వానించాలని స్పష్టం చేశారు. ఒకవేళ ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించి అమలు చేస్తామని ఆయన హెచ్చరికలు జారీ చేశారు.కలెక్టర్లకు వినతిపత్రాల వెల్లువ : ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ జేఏసీ అమరావతి ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు రెవెన్యూ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరిని బొప్పరాజు వెంకటేశ్వర్లు కలిశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను వివరిస్తూ ఆమెకు వినతిపత్రం సమర్పించారు.రూ. 30 వేల కోట్ల బకాయిలు ఇవ్వకపోతే భారీ ఉద్యమం తప్పదు : బొప్పరాజు (జుం)రాష్ట్ర ప్రభుత్వం ముందు బొప్పరాజు పలు కీలక డిమాండ్లను ఉంచారు. 'గత ప్రభుత్వం హయాంలో ఉద్యోగులకు సంబంధించి సుమారు రూ. 30 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి చెల్లింపు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి. ఉద్యోగులకు కొత్త పీఆర్సీ (వేతన సవరణ సంఘం) ఇచ్చేందుకు తక్షణమే కమిషన్‌ను నియమించాలి. పీఆర్సీ నివేదిక వచ్చి అమలు జరిగే వరకు, ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలి. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం బకాయిలను వెంటనే మంజూరు చేయాలి. ఉద్యోగులకు రావాల్సిన లీవ్ ఎరియర్స్, సరెండర్ లీవ్ నగదును తక్షణమే విడుదల చేయాలి' అని కోరారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com